క్లుప్తంగా

ప్రాథమిక అక్షరాస్యతపై దృష్టి సారించండి


సూచనలిస్తున్న ఎంఈఓ రంగస్వామి

మద్దికెర : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రాథమిక అక్షరాస్యతపై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓలు రంగస్వామి, గోపాల్ సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం న్యూ ఎడ్యుకేషన్‌పై అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజుల శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రాల్లో చిన్నారులకు అంకెలు, అక్షరాలు నేర్పించాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మినారాయణ, లక్ష్మి పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న సీఐ పులిశేఖర్

మద్దికెర : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే బండల లాగుడు పోటీలు గ్రామీణుల్లో ఐక్యమత్యాన్ని పెంచుతాయని సీఐ పులిశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్పస్వామి రథోత్సవం సందర్భంగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

దేవనకొండ: పుటకలమర్రి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం హిందీ భాషోత్సవాలను ఘనంగా నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యత, విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, దేశ ఐక్యత గురించి ప్రిన్సిపాల్ డాక్టర్ షమీల వివరించారు. హిందీ ఉపాధ్యాయుడు మధుసూదన్ ఆధ్వర్యంలో వ్యాసరచ, ఉపన్యాస పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సమస్యలు పరిష్కరించండి

ఆలూరు రూరల్: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సహకరించాలని ఆలూరు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాహిద్ కోరారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం హెచ్‌డీసీ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి ఆవరణలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని చెప్పారు. ల్యాబ్‌లో పరికరాల కొనుగోలుపై చర్చించారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ సిలిండర్ల రీఫిలింగ్, వివిధ రకాల రిజిస్టర్ల కోసం ఎంతమేర అవసరమవుతుందో సభ్యులకు తెలియజేశారు. సభ్యులు సుశీల బాయి, వైద్యులు శ్రీకాంత్,మయూర్,రామకృష్ణ ఉన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి


శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్ : మరాఠా యోధుడు, హైందవ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం పత్తికొండలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ హైందవ సామ్రాజ్యస్థాపన కోసం హిందువులందరినీ జాగృతం చేసి ఏకత్రాటిపైకి తీసుకొచ్చిన పోరాట పటిమగల ధీరుడు శివాజీ అని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, జిల్లా కార్యదర్శి హోసూరు బ్రహ్మయ్య, నాయకులు పూనామల్లికార్జున, కరణం నరేష్, వీరేష్, రామాంజనేయులు, శంకరయ్య, సిసిరంగన్న, నాగేష్, భాస్కర్, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక గ్రంథాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపు చేపట్టారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

వెల్దుర్తి: మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జెడ్పీటీసీ సుంకన్న కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ రంగయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సచివాలయాల ద్వారా సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అలాగే మండల అధికారులు కూడా తమ విధులు, బాధ్యతలు తెలుసుకుని నడుచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సుహాసినమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చుంచుఎర్రగుడిలో వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న గోడౌన్ పనులు నిలిచిన దృశ్యం


అమకతాడులో 500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ కోసం ఏర్పాటు చేసిన గోడౌన్ ఇలా..

ఆదుకోవాల్సింది పోయి.. అడ్డంకులా!

- అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి సర్కారు మోకాలడ్డు
- వైఎస్ జగన్ హయాంలో గోడౌన్ల నిర్మాణాలు ప్రారంభం
- చివరి దశలో ఉన్నప్పటికీ పూర్తి చేయని ప్రభుత్వం

కృష్ణగిరి: భూసార పరీక్షల నుంచి దిగుబడులను విక్రయించేంత వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నకు చేదోడుగా నిలిచింది. అడుగడుగునా అండగా నిలవడంతో ఆ ఐదేళ్లూ వ్యవసాయం పండుగలా సాగింది. వివిధ సంక్షేమ పథకాలతో వారిని ప్రోత్సహించింది. అలాగే దిగుబడులకు మార్కెట్‌లో ధర లేని సమయం, ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గ్రామాల్లోనే గోడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా లక్షలాది రూపాయలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టింది. అయితే కొన్ని చోట్ల వివిధ కారణాల వల్ల నిర్మాణాలు ఆలస్యమైన వాటిని పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. మండల వ్యాప్తంగా 12 గోడౌన్లు మంజూరు కాగా అందులో ఎనిమిదింటి నిర్మాణాలు ప్రారంభించగా తుది దశకు చేరాయి. వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న వాటిని రూ.80 లక్షలు, 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న వాటిని రూ. 40 లక్షలతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే అసంపూర్తిగా నిలిచిన వీటిని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సహకరించడం లేదు. వాటి గురించి కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో నిర్మాణాల పూర్తిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎన్నటికి పూర్తవుతాయోనని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.


పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా చేస్తున్న కమ్యూనిస్టు పార్టీల నాయకులు



ఆలూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం

పత్తికొండ రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించడంలో పూర్తిగా అన్యాయం జరిగిందని సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి, రాజాసాహేబ్ అన్నారు. పేదలపై భారం మోపుతూ, హామీలను విస్మరిస్తూ ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలిలో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. సీపీఎం, సీపీఐ నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, రంగన్న, రామాంజనేయులు, గురుదాస్, కృష్ణయ్య, రంగన్న, సురేంద్ర పాల్గొన్నారు.

- ఆలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నుల కోసమేనని వామపక్ష పార్టీ నాయకులు విమర్శించారు. పేదలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఆదాయాన్ని సృష్టించే కార్మికులు,కర్షకులకు రాయితీలు ప్రకటించకుండా సామాన్య ప్రజలపై భారం మోపేలా బడ్జెట్ ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి పాల్గొన్నారు.
- దేవనకొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు విమర్శించారు. బుధవారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక బస్టాండులో నిరసన తెలిపారు. అశోక్, రవి, నాగేంద్ర, పాండు, కోదండ, మహాదేవ, మహేష్ పాల్గొన్నారు.
- తుగ్గలి : కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు బుధవారం నిరసన తెలిపాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నబిరసూల్, జిల్లా సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి సుల్తాన్, సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులకు పూర్తి వ్యతిరేకంగా ఉందని వారు మండిపడ్డారు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాముడుకు వినతి పత్రం అందజేశారు.

అసైన్డ్ భూములకు రక్షణ కల్పించండి

కృష్ణగిరి: మాదిగలకు ప్రభుత్వాలు కేటాయించిన అసైన్‌మెంట్ భూములకు రక్షణ కల్పించాలని ఎమ్మార్పీఎస్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాదిగ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో భూమి లేని దళితులకు ప్రభుత్వాలు కేటాయించిన భూములు చాలా వరకు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ప్రభుత్వం అర్హులైన వారికి పట్టా ఇచ్చినా కొందరు అధికారులు అండతో కబ్జాకు గురయ్యాయన్నారు. అధికారులు స్పందించి పేదలకు భూములు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకాష్ మాదిగ, పుల్లయ్య మాదిగ, శివరాముడు ఉన్నారు.


తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్‌ఎస్ నాయకులు

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామ సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుంకనూరుకు చెందిన వీరేష్, మల్లి ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలో జరిగే దేవర చూడడానికి వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వస్తుండగా కర్నూలు నుంచి ఆస్పరికి వెళ్తున్న ఓ గుర్తు తెలియని వాహనం వేగంగా బైకును ఢీకొట్టింది. దీంతో వీరేష్, మల్లికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు వారిని దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్. నగరం గ్రామం నుంచి బుధవారం సాయంత్రం వెల్దుర్తి వస్తూ యాదరాళ్ల సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో బేతంచర్ల మండలం, ముద్దవరం గ్రామానికి చెందిన రవీంద్రకు గాయాలయ్యాయి. గుర్తించిన గ్రామస్తులు వెంటనే 108కి సమాచారం అందించగా క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బల్లూరులో గడ్డివాముల దగ్ధం


అగ్ని ప్రమాదంలో గాయపడిన ఎద్దు

హాలహర్వి: మండలంలోని బల్లూరు గ్రామంలో బుధవారం నాలుగు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు మోహన్ రెడ్డి, ఈరప్పకు చెందిన రెండు చొప్పున గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు వెంటనే ఆలూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ప్రమాదంలో గడ్డివాములతో పాటు ఒక టైరు బండి పూర్తిగా కాలిపోయింది. అలాగే..ఓ ఎద్దుకు పూర్తిగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితా రైతులు వాపోయారు.

ఆశాజనకంగా చీని

బాపనదొడ్డి సమీపంలో ఇలా..


పెనుమాడ సమీపంలో విరబూసిన పూతతో చీని చెట్లు

కృష్ణగిరి: ఈ ఏడాది ఖరీఫ్, రబీ పంటలు అన్నదాతలకు నష్టాలు మూటగట్టాయి. ఖరీఫ్‌లో వేరుశనగ, ఆముదం, పత్తి, వరి పంటలు దెబ్బతినగా, రబీలో శనగతో పాటు బోరు బావుల కింద వేసిన వేరుశనగ, ఉల్లి, టమాట, ఇతర కూరగాయల పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టాలు వచ్చాయి. ప్రస్తుతం చీనీ చెట్లకు పూత పుష్కలంగా రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పంటైనా ఆదుకోకపోతుందా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


విశేష అలంకరణలో సాయిబాబా


లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో ఆనందసాయి ఆలయ పదో వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు కాకడహారతి అందించారు. 8.30 గంటల నుంచి ఆనందసాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ శ్రీకంఠ మూర్తి ఆధ్వర్యంలో గణపతి పూజ చేశారు. అనంతరం లక్ష్మీగణపతి హోమం, రుద్రస్వాహాకార హోమం తదితర పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా కమ్మరచేడు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి వెంకటేశ్వర నాట్య మండలి వారు పాతాళ విజయం, తోలు బొమ్మలాట ప్రదర్శన చేపట్టారు.

22న పత్తికొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

పత్తికొండ(తుగ్గలి) : కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతుల సహకారంతో ఈనెల 22వ తేదీన పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంపు కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం తెలిపారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్త పద్ధతి గురూ!

- నూతన పద్ధతిలో పండ్ల తోటలకు మందుల పిచికారీ
- ట్రాక్టర్‌కు నూతన పరికరం అమర్చి మందు స్ప్రే చేస్తున్న బాపనదొడ్డి రైతు


బాపనదొడ్డి సమీపంలో ట్రాక్టర్‌తో నూతన పద్ధతిలో దానిమ్మ పంటకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు త్వరగా ఆదరణకు గురువుతున్నాయి. వ్యవసాయమే భారం అనుకున్న సమయంలో కొందరు రైతులు ఇలా నూతన పద్ధతులను అందిపుచ్చుకుని ముందుకు సాగుతున్నారు. మండలంలోని బాపనదొడ్డి గ్రామానికి చెందిన రైతు సురేష్‌రెడ్డి 8 ఎకరాల్లో దానిమ్మ పంట సాగు చేశాడు. ఈ పంటకు మందు పిచికారీ చేయాలంటే కూలీలకు భారీగా ఖర్చు వస్తుండటం, కొంత అవస్థలతో కూడుకున్నది కావడంతో ఎలాగైనా సులభ పద్ధతి అన్వేషణలో భాగంగా.. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి రైతులు అనుసరిస్తున్న ఓ విధానం నచ్చడంతో తాను అవలంభించేందుకు శ్రీకారం చుట్టాడు. ట్రాక్టర్ ట్యాంక్‌కు 12 నాజిళ్లు ఉన్న ఫ్యాన్ పంకాను అమర్చి దాని ద్వారా స్ప్రే చేయడం ప్రారంభించాడు. ఇలా చేయడం వల్ల కూలీల ఖర్చుతోపాటు మందు పక్కకు వెళ్లకుండా చెట్లకు పూర్తిగా పడుతుందని, సమయం కూడా ఆదా అవుతుందని రైతు తెలిపాడు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

హాలహర్వి: భూములు కలిగిన ప్రతిరైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య (యూనిక్ ఐడీ)ని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని గూళ్యం-1, 2 రైతు సేవా కేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ఉంటేనే భవిష్యత్‌లో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం లేదా వన్‌బీ, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకు అయిన మొబైల్ ఫోన్ తీసుకుని వెళ్తే నమోదు చేస్తారని చెప్పారు.


నేడు దరఖాస్తుల పరిశీలన

దేవనకొండ: మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం దరఖాస్తుల పరిశీలన ఉంటుందని ఎంపీడీఓ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. దేవనకొండ, పి.కోటకొండ, తెర్నెకల్, కప్పట్రాళ్ల గ్రామాల్లోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల కింద దరఖాస్తు చేసుకున్న వారికి వెరిఫికేషన్ ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

21న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

ఆలూరు రూరల్: బీసీ,కాపు,ఈబీసీ,ఆర్యవైశ్య,బ్రహ్మణ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 21వ తేదీ నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్ బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆలూరు,మొలగవల్లి,ఆస్పరి ఎస్బీఐ, ఏపీజీబీ, యూనియన్ బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారంతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు జత చేసి సమర్పించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ జయన్న

పత్తికొండ రూరల్ : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ సీఐ జయన్న పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్, స్క్రీన్ ప్రజెంటేషన్‌తో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు ఆశ చూపించి ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నకిలీ యాప్స్ వల్ల మోసపోకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జమీర్ ఉన్నారు.

మద్దికెర : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహన లేకపోతే ఆర్థికంగా నష్టపోతారని ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జ్యోతి, పోలీస్ సిబ్బంది గోపాలచంద్ర పాల్గొన్నారు.

నేడు ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు: స్థానిక ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో గురువారం జాబ్‌మేళా ఉదయం 10:30 నుంచి ప్రారంభమవుతుందని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బి.వీరభద్రగౌడు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి కర్నూల్ ఎంపీ బస్తిపాడు నాగరాజు, గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు చెప్పారు. దాదాపు 60 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. డిగ్రీ,బీటెక్, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.


ముత్తుకూరులో పెద్దమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి


ఎల్.నగరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వైభవంగా గ్రామ దేవతల దేవర

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో బుధవారం పెద్దమ్మవ్వ, బంగారమ్మవ్వ దేవర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయాలలో పెద్దమ్మవ్వ, బంగారమ్మవ్వకు గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. భక్తులు మేళతాళాలతో కుంభాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. పూజల్లో ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి పాల్గొన్నారు. సర్పంచ్ తోయజాక్షప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, బసవరాజు, గోవర్ధన, పెద్దయ్య, అశోక్, వేణుగోపాల్,ఉశేని,తిమ్మప్ప, కొలుట్లయ్య, రాజన్నగౌడ్, ప్రకాష్, మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం..

హాలహర్వి: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు.బుధవారం మండలంలోని బాపురం గ్రామంలో ఈరన్నగౌడ్ కుమారుడు సునీల్ వివాహ రిసెప్షన్‌కు ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్దగేరి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామరెడ్డి, కో కన్వీనర్ మల్లికార్జున పాల్గొన్నారు. అలాగే.. ఇటీవల అనారోగ్యంతో మరణించిన హొళగుందకు చెందిన గడిగే బసవరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి భార్య పార్వతి, కుమారుడు సోదరులకు ధైర్యం చెప్పారు. అంతకుముందు డిష్ మంజునాథ కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

వెల్దుర్తి: మండలంలోని ఎల్.నగరం గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న అమ్మవార్ల దేవర ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం గ్రామ దేవతలైన పెద్దమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, సుంకులమ్మ, బజారు సుంకులమ్మ అమ్మవార్లకు బలిదానాలు సమర్పించారు. అనంతరం ప్రతి ఇంటి నుంచి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పత్తికొండ, డోన్ మాజీ ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, కోట్ల సుజాతమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, వెల్దుర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా


మాట్లాడుతున్న హనుమంతరావు

ఆలూరు రూరల్: జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆలూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు, స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం రవాణాపై ఆరా తీశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం రవాణాపై కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో రూట్ వాచ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, ఆలూరు ఎస్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


శ్రీరంగాపురం శివాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలు

వెల్దుర్తి: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ముద్దయ్యస్వామి శివాలయంలో నవగ్రహాలు, నాగ ప్రతిమ విగ్రహాలను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ప్రతిష్ఠ కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ దాతలను గ్రామ పెద్దలు సన్మానించారు.

ఆలూరు: స్థానిక మర్రితాత మఠం ఆవరణలో బుధవారం పండితులు గౌవిసిద్దయ్యస్వామి ఆధ్వర్యంలో శ్రీబండిమాంకాళమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తెల్లవారుజామున ప్రత్యేకంగా గణపతి హోమం తదితర పూజలు నిర్వహించారు. స్థానికులు పాల్గొని పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కారుమంచిలో ఉరుసు

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం నేమటూరు ఉసేనప్పతాత ఉరుసు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మి బుధవారం తెలిపారు. గ్రామంలో నేమటూరు ఉశేనప్పతాత గుర్రాన్ని మేళతాళాలతో ఊరేగిస్తామన్నారు. శుక్రవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.